

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 | సంచిక : 19 | పుష్పం : 48-49 | 20-6-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 19

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

20-09-2003


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 5-6-2003. జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగాకాని అభివృద్ధిలోనికి రావాలంటే స్వార్థం తగ్గించుకోవాలి, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. ఒక మనిషి స్వార్థపరుడు అయినప్పుడు, వాడు సాధన చేసినా వాడికి ఆత్మజ్ఞానము కలిగే అవకాశం లేదు. అసూయ, విమర్శ, చెడు అంతా స్వార్థంలో నుండే వస్తుంది. ఈ శరీరం చనిపోయిన తరువాత కాదు, ఈ శరీరం ఉండగానే కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం, అసూయ యొక్క వేగం తగ్గించుకోమని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడి కంటే మన క్షేమంకోరే వారు ఎవరూ లేరు. మేము సాధన చేస్తున్నాము. ఏమీ ఫలితం కనబడటంలేదు అని కొంతమంది అంటారు. మీరు చేస్తున్న సాధన నిజమైతే మీకు వినయం రావాలి, మీ మనస్సు అణగాలి. మేము ధ్యానం చేస్తున్నాము అని మీరు అనుకోవచ్చు కాని మనోనిగ్రహం లేకుండా, ఇంద్రియ నిగ్రహం లేకుండా, క్రమశిక్షణ లేకుండా, సహనం లేకుండా మీరు ధ్యానం చేయలేరు. మీకు ధ్యానం కుదిరితే తరువాత సమాధిస్థితి కలుగుతుంది, సమాధిస్థితిలో మీకు ఆత్మానందం అనుభవంలోనికి

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


5-6-2003 జిన్నూరు ........ 1
9-6-2003 భీమవరం ........ 11




వస్తుంది. శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం కాపాడుకోవాలి. శరీరానికి అనారోగ్యం వస్తే ఇంట్లో అందరూ పట్టించుకుంటారు. హాస్పిటల్‌కు తీసుకొని వెళతారు, కాని మానసికఅనారోగ్యం వస్తే ఎవరూ పట్టించుకోరు. అందుచేత భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే ఎవరోవచ్చి మిమ్మల్ని ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు. మీ మనస్సును మీరే సంస్కరించుకోవాలి, మీ మనస్సును బాగుచేసుకొని మీ మనస్సుసహాయంతో మిమ్మల్నిమీరు ఉద్ధరించుకోండి. సభ్యత, సంస్కారం, నాగరికత పెంచుకొని మీరు ఆత్మానుభవం పొందాలి. మీరు చేసే ప్రయత్నం హృదయపూర్వకంగా చేస్తూ ఉంటే దైవసహాయం వస్తుంది. మీరు స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన మనస్సులో మాధుర్యం ఉంటే స్నేహం యొక్క మాధుర్యం కూడా మనకు తెలుస్తుంది. మనం కొంతసేపు సాధన చేసి చెడు స్నేహాలు చేస్తూ ఉంటే సాధన వలన వచ్చే ఫలితం కూడా పోతుంది. అందుచేత మంచి సహవాసాలు చేయాలి. మనం పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినా సత్పురుషులతోటి, సాధుపురుషులతోటి సహవాసం చేయాలి. సత్పురుషుల సహవాసం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సాధనచేసి శక్తిని సంపాదించి, ఆశక్తి వలన మహాత్ముడు అవ్వాలిగాని ఎవరో ఇతరులను విమర్శించటం వలన ఎవడూ మహాత్ముడు కాలేడు. మనం ఎవరినైనా విమర్శించేటప్పుడు వారి గౌరవం పోతుంది అని మనం అనుకొంటాము కాని వారి గౌరవం పోదు, చివరకు జరిగేది ఏమిటి అంటే మన గౌరవం పోతుంది. ఇతరులను విమర్శించటం వలన మనం పతనమవుతాము. మనలను మనం విమర్శించుకోవటం వలన ఆధ్యాత్మికంగా, భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తాము. మనం ఇంట్లోకాని, సమాజంలోకాని తక్కువ మాట్లాడటం మంచిది. తక్కువ మాట్లాడేవారికి గౌరవం ఎక్కువ ఉంటుంది. ఎక్కువ మాట్లాడే వారికి ఆలోచన ఉండదు, దానివలన ఉన్న గౌరవం పోతుంది. ఈ శరీరం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పనిని మనం నిర్మలంగా చేయాలి, నిశ్చలంగా చేయాలి, ఏకాగ్రంగా చేయాలి. ప్రతీ చిన్న పనికూడా పెద్ద మనస్సుతో చేయాలి, చిత్తశుద్ధితో చేయాలి. ఒకసారి భగవాన్ దగ్గరకు ఒక కలెక్టర్‌గారు వచ్చారు నేను అది చేద్దామనుకుంటున్నాను, ఇది చేద్దామనుకుంటున్నాను అని ఏదేదో మాట్లాడారు. భగవాన్ ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నారు. నేను మాట్లాడే మాటలకు అర్థంలేదా, మీరు ఏమీ మాట్లాడటం లేదు ఏమిటి అని ఆ కలెక్టరు గారు భగవాన్‌ను అడిగారు. భగవాన్ చిన్నగా నవ్వి ఏమి చెప్పారు అంటే ఏ పని నిమిత్తం

మీ శరీరాన్ని ఈశ్వరుడు ఈ భూమి మీదకు పంపాడో ఆ పని మీరు ఆలోచించినా, ఆలోచించకపోయినా, మీకు చెయ్యాలనే సంకల్పం ఉన్నా, లేకపోయినా మీ సంకల్పంతో నిమిత్తం లేకుండా మీ శరీరం ద్వారా ఆ పని జరిగిపోతుంది. నేను అది చేసాను, నేను ఇది చేసాను అని అనుకోవటం వలన వ్యక్తిభావన పెరుగుతుంది. చివరకు తలపోటు మిగులుతుంది. మనం చేసేపనిద్వారా మనకు వ్యక్తి భావన తగ్గాలి, అహంభావన తగ్గాలి. భగవంతుడు ఉన్నాడా, లేడా అనే సంశయం మనకు రాకూడదు. అలా సంశయం తెచ్చేది మన అహంభావనే. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ధృడనిశ్చయం కనుక మనకు ఉంటే అశాంతి తగ్గిపోతుంది. మేము సాధన బాగాచేసుకొంటున్నాము అని చాలామంది అంటారు. మీరు చేస్తున్న సాధన నిజమైతే మీ మొఖంలో వినయంకనబడాలి, మీ మాటలో వినయం కనబడాలి కదా. మీ మాటలో వినయం లేదు, మీ ప్రవర్తన సాత్వికంగా లేదు, మేము బాగా సాధన చేస్తున్నాము అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? అసలు వినయం లేకుండా భగవదనుభవం కలుగదు. ఈ ప్రపంచం మిమ్మల్ని దుఃఖపెట్టకుండా ఉండాలంటే, ఈ ప్రపంచం మిమ్మల్ని బాధించకుండా ఉండాలంటే మీ మనస్సుతో ఈ ప్రపంచాన్ని చూడటం మానివేయండి. ప్రపంచాన్ని చూడండి కాని మనస్సుతో చూడవద్దు. ఎందుచేతనంటే రాగద్వేషములు అన్నీ మనస్సులో ఉన్నాయి, పరిమితులు అన్ని మనస్సులో ఉన్నాయి. మనస్సుతో ప్రపంచాన్ని చూడటం మానివేస్తే ఈ ప్రపంచం మనలను ఏమీ చేయలేదు. మనం మనస్సుతో ఈలోకాన్ని చూస్తే లోకం మనలను పీడిస్తుంది, మనస్సుతో లోకాన్ని చూడకపోతే లోకం మనల్ని చేసేది ఏమీలేదు. ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీలేదు. మీరులోకాన్నిచూసేటప్పడు ఇందులో కనిపించే మనుషులు, ఇక్కడ జరిగే సంఘటనలు అన్నీ కూడా స్వప్నసమానంగానే చూడండి. స్నేహాలు కూడా అతిగా చేయకూడదు. దానివలన కాలం వృధా అవుతుంది. మనం ఏదైనా మంచిపని చేసినా విమర్శించేవారు చాలామంది ఉంటారు, దానికి కారణం అసూయ. గాఢనిద్రలోను మనం ఉన్నాము, జాగ్రదవస్థలో మనం ఉన్నాము. గాఢనిద్రలో మనకు దుఃఖం లేదు. జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి దుఃఖం వస్తుంది. కారణం గాఢనిద్రలో మనకు మనస్సులేదు, జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి మనస్సు వస్తోంది. ఎక్కడ మనస్సు ఉంటే అక్కడ దుఃఖం ఉంటుంది. మీరు గాడనిద్రలో ఎలా ఉన్నారో జాగ్రదవస్థలో కూడా అలా ఉండటం నేర్చుకోండి.

కొంతమంది 24 గంటలు భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఉంటారు. అక్కడనుండి భయం కలుగుతుంది. భయం వలన దుఃఖం వస్తుంది. మానవుడిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే ఆలోచిస్తే భవిష్యత్ గురించి ఆలోచిస్తాడు లేకపోతే జరిగిపోయిన సంఘటనలు తలపెట్టుకొంటాడు. దీనివలన చేతిలోఉన్న వర్తమానకాలం జారిపోతుంది. మనం భవిష్యత్ గురించి ఊహించకూడదు, జరిగిపోయినది తలపెట్టుకోకూడదు. నీ శరీరం ద్వారా ఏ పని జరగవలసిఉందో అది నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా భవిష్యత్‌లో అది జరుగుతుంది, దానికి ఇప్పడు ఊహలు అనవసరం, దాని వలన టైము, శక్తి వృధా అవుతుంది. వర్తమానకాలాన్ని ఉపయోగించుకో. ఎప్పడూ, ఎట్టిపరిస్థితులలో మీ శాంతిని పాడుచేసుకోవద్దు. ఎందుచేతనంటే శాంతి ఒకసారి జారిపోతే మరల సంపాదించుకోవటం కష్టం. మీ బిడ్డలు ఏవైనా మంచిపనులు చేస్తే మీకు ఎంత సంతోషం కలుగుతుందో, మీరు సంపాదించిన డబ్బును సద్వినియోగం చేసినా అంతే సంతోషం కలుగుతుంది అని ఒక తమిళ కవి చెప్పారు. నా హృదయంలో సత్యవస్తువు ఉందని చెపుతున్నారు కాని అది నాకు అనుభవంలోనికి రావటం లేదు అని అడుగుతున్నారు. అది క్రమేపీ నీకు అనుభవంలోనికి వస్తుంది, అంత సడన్‌గా రాదు ఎందుచేతనంటే అది అనుభవంలోనికి రావటానికి నీలో చాలా ప్రతిబంధకాలు ఉన్నాయి. ఆ ప్రతిబంధకాలు తగ్గేకొలది లోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. ఆ ప్రతిబంధకాలను తొలగించుకోవటమే నీ సాధనయొక్క ప్రయోజనం. నాకు నామం మీద శ్రద్ద కలగటం లేదు అని ఒక అమ్మగారు అడుగుతున్నారు. శ్రద్ద కలగాలంటే సత్పురుషులతో సహవాసం చేయాలి. భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం ఉన్నవారితో సహవాసం చేయటం వలన మీకు శ్రద్ద కలుగుతుంది. శ్రద్ద వలన మీకు జ్ఞానం కలుగుతుంది. మనకు పరిస్తితులు అనుకూలంగా ఉన్నా, సంపదలు ఉన్నా ఇవి అన్నీ నిజంకాదు, స్వప్నసమానము. వీటిని చూసి గర్వం తెచ్చుకోవద్దు. గర్వం వస్తే మానవుడు పతనమవుతాడు. మనం ఉద్రేకంగా మాట్లాడితే మన మాటలను మనమే మింగవలసి వస్తుంది. మనకాలు జారితే మరల మనమే తీసుకోవాలి. మనకు ఆలోచన ముఖ్యం, ఆవేశం ముఖ్యంకాదు. ఆలోచన, విశ్వాసం ఈ రెండూ పట్టుకొని మనం భగవదనుభవం పొందాలి.

భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన పని చేస్తున్నాడు, మన జీవితాన్ని ఎప్పడు ఎలా మలుపు తిప్పాలో ఆయన చూసుకొంటాడు. మీ మనస్సులో ఏదైనా దోషం ఉంటే ఆ దోషాన్ని మీకు చూపిస్తాడు, ఆ దోషంలో నుండి బయటపడటానికి

తగిన శక్తిని ఇస్తాడు. వాడే ఈశ్వరుడు, వాడే గురువు. దిలీప్‌కుమార్‌రాయ్ అని ఒక కృష్ణభక్తుడు ఉండేవాడు, ఆయన పూనాలో ఆశ్రమం పెట్టుకొన్నాడు. ఆయన దగ్గర ఒక శిష్యురాలు ఉండేది. దిలీప్‌కుమార్‌రాయ్‌కంటే ఆవిడకు కృష్ణుడి మీద ఎక్కువ విశ్వాసం ఉండేది.ఒకరోజు ఆమెకు కృష్ణుడు దర్శనం ఇస్తాడు. అది దిలీప్‌కుమార్ రాయ్‌కు చెపుతుంది. నాకు ఇంకా కృష్ణుడు దర్శనం ఇవ్వలేదు అంటే నాలో ఏదో లోపం ఉంది అని అనుకొని ఇంకా గాఢంగా తపించగా, తపించగా కొంతకాలం తరువాత కృష్ణదర్శనం అయింది అని ఆయన చెప్పారు. దిలీప్‌కుమార్‌రాయ్ కంటే శిష్యురాలి హృదయం పవిత్రమైనది అని కృష్ణుడికి తెలుసు. అందుచేత ముందుగా ఆవిడకు దర్శనం ఇచ్చాడు. ఎవరిని ఎప్పడు జ్ఞానంతో అలంకరించాలో భగవంతుడు చూసుకొంటూ ఉంటాడు. అంతా ఆయనకు తెలుసు. అర్హత వచ్చినప్పడు, యోగ్యత వచ్చినప్పడు ఒక్కక్షణం కూడా ఆగడు. గౌతమబుద్ధుడు ఏమి చెపుతున్నాడు అంటే చాలామంది ఇంటిదగ్గర కూర్చొని మేము శ్రేష్ఠులం, మేము శ్రేష్ఠులం అనుకొంటున్నారు. మీ రూపాన్ని మర్చిపోయి, మీ నామాన్ని మర్చిపోయి ఎప్పడైనా ఎవరికైన సహకరించారా? అలా సహకరిస్తే మీరు శ్రేష్ఠులు. సమాజానికి ఏమీ ఉపయోగపడకుండా ఇంటి దగ్గరకూర్చొని మేము శ్రేష్ఠులం అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? అంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు, అది మీకు తెలియటంలేదు. మీరు నామం చేసేటప్పడు శ్రద్ధగా చేస్తే, హృదయపూర్వకంగా చేస్తే మీరు తరించటం కాదు, మీ పూర్వీకులు కూడా తరిస్తారు. మనకు భక్తి చేతకాదు, శ్రద్ధచేతకాదు, యుక్తి చేతనవును. ఏదో యుక్తిగా మాట్లాడటం, తెలివిగా మాట్లాడాము అనుకోవటం, దానికి ఎవడు సంతోషిస్తాడు? వాడికి దేవుని అనుగ్రహం వస్తుందా? అంటే వాడు సమాజానికి పనికిరాడు, భగవదనుభవం పొందటానికి పనికిరాడు. మీరు మారుమనస్సు కనుకపొందితే, లోపలఉన్న సద్వస్తువు మీకు ఎరుకలోనికి వస్తే, ఇప్పడు మీరు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నారో అలాగ లోపలఉన్న సద్వస్తువుతో తాదాప్యం మీకు వస్తే కనిపిస్తున్నటువంటి ఈ లోకం, పంచభూతాలతో నిర్మితమైన ఈ లోకం మీకు పరలోకరాజ్యంగా, వైకుంఠంగా గోచరిస్తుంది. మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేయండి. శాస్త్రాన్ని, భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోండి. లోపల గురువు ఉన్నాడు, ఆయన మిమ్మల్ని గైడ్ చేస్తూఉంటాడు. గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నేను చెప్పేది అంతా చెప్పాను, హృదయపూర్వకంగా మీ శ్రేయస్సు కోరి ప్రేమతో చెప్పాను. ఆ మాటలు వినమని, ఆ మాటలు నమ్మమని నేను బలవంతం చేయను. నేను చెప్పిన ఆ మాటలు వింటే నీవు బాగుపడతావు, వాటిని వినవు అనుకో నీవు నశిస్తావు. మనం అహంకారంతో, అసూయతో చెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకోకూడదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకోవాలి. మన శరీరం చనిపోయాక జీవుడికి ఏమైనా ప్రయాణాలు ఉంటే, ఇతరలోకాలకు వెళ్ళవలసిఉంటే వెళతాడు మరల తిరిగి ఈభూమి మీదకు రావలసిందే. ఈ శరీరం ఉండగా సాధన చేసి మన జీవలక్షణాలను పోగొట్టుకోవాలి కాని చనిపోయిన తరువాత సాధన చేసే అవకాశంలేదు, ఇతర లోకాలు సాధనకు పనికివచ్చే లోకాలు కాదు. అందుచేత ఈ శరీరం ఉండగానే కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని జీవలక్షణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మన శరీరం మరణించే టైములో భగవదనుభవం పొందటానికి ఏవైతే ప్రతిబంధకాలు ఉన్నాయో వాటిని కొత్తశరీరం వచ్చిన తరువాత సాధనచేసి తొలగించుకొంటే మనకు భగవదనుభవం కలుగుతుంది కాని మరణానంతర జీవితంలో మనం పొందేది ఏమీలేదు.

సజ్జనసాంగత్యం యొక్కరుచే మీకు తెలియదు అనుకోండి. ఇంక వారిలో సహవాసం ఏమి చేస్తారు. ఓరామా! నీ నామం యొక్క రుచి తెలియనివాడు నీ నామం ఎందుకు చేస్తాడు అంటాడు త్యాగరాజు. సాక్షాత్తు బ్రహ్మమే రాముడి రూపం ధరించింది.రామా రామా అంటే ఒక వ్యక్తి అనుకోవద్దు, పరబ్రహ్మమే. నామంలో రుచి మనకు తెలియటం లేదు అనుకోండి, సత్పురుషుల సహవాసం యొక్క విలువ మనకు తెలియటం లేదు అనుకోండి దానికి మన మనస్సులో ఉన్న దోషమే కారణం. సత్పురుషుల సహవాసం వలన మనోబలం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మన శరీరంలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటే తొందరగా రోగం రాదు. అలాగే మనకు మనోబలం పెరిగితే, ఆత్మవిశ్వాసం పెరిగితే లోకం యొక్క ప్రభావం మన మీద పడదు, లోకం నీకు కనిపిస్తూ ఉన్నా లోకం నిన్ను ఏమీ చేయలేదు. ఈ శరీరం చనిపోతే బంధువులతో, స్నేహితులతో, ఈ లోకంతో అన్నింటితో సంబంధం తెగిపోతుంది, ఈ తుక్కునుతీసుకొనివెళ్ళి కాల్చేస్తారు కాని ఒకటి మటుకు మీరు గుర్తుపెట్టుకోండి, భగవంతుడు మటుకు మనలను విడిచిపెట్టడు. ఆయన అనుభవం మనకు కలిగేవరకూ భగవంతుడు మనలను విడిచిపెట్టడు.

మీకు అనేక తలంపులు వస్తూ ఉంటాయి, కంగారు పడకండి. భగవంతుని స్మరణ

విడిచిపెట్టవద్దు, ధ్యానం విడిచిపెట్టవద్దు. తలంపులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. తలంపులన్నీ మనస్సులో ఉన్నాయి. మీరు మనస్సును పట్టించుకోకపోతే ఏమీలేదు. ఆ మనస్సే నేను అనుకోవటం వలన అది మిమ్మల్ని బాధిస్తోంది. కాని ఆ మనస్సుతో తాదాప్యం పోతే అది మిమ్మల్ని బాధించదు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే సాధన అంటే ఉండటమే, మీరు ఇప్పుడు ఎలా ఉంటున్నారో అలా ఉండకండి, మీరు ఏదిగా ఉన్నారో అలా ఉండండి. మీరు ఇప్పుడు శరీరంగా ఉన్నారు, మనస్సుగా ఉన్నారు. గంట గంటకు మారేది మనస్సు, పుట్టేది చనిపోయేది శరీరం. మీరు మనస్సుకాదు, మీరు శరీరం కాదు. మీ లోపల ఒక చైతన్యం ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు. అది మీరై ఉన్నారు. మీరు ఏదిగా ఉన్నారో అలాగ ఉండటమే సాధన. మీరు దేహంగా ఉండవద్దు. మనస్సుగా ఉండవద్దు. మీరు బ్రహ్మంగా ఉండటం నేర్చుకోండి. మీరు దేహంగా ఉంటే, మనస్సుగా ఉంటే పరిమితులు వస్తాయి. మీరు కర్తృత్వభావన పెట్టుకోవద్దు. ఈ ప్రపంచం ఏమవుతుంది, దానిని ఎవరు ఉద్ధరిస్తారు అని అనుకోవద్దు. ఈ ప్రపంచాన్ని ఎవడైతే కల్పించాడో వాడు ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి పోలేదు అంతా ఆయనే చూసుకొంటాడు. మా ఇంట్లో అంతా బాగానే ఉంది, వంట్లో అంతా బాగానే ఉంది కాని శాంతిలేదు అని కొంతమంది అంటూఉంటారు. శాంతి లేకపోతే మీకు నష్టం ఏమిటి? డబ్బు ఉందికదా మీరు హాయిగా ఉండవచ్చుకదా. సంపదవలన భోగం వస్తుంది కాని సుఖంరాదు. శాంతి వలన సుఖం వస్తుంది. సుఖం ఉన్నవాడు హాయిగా ఉండగలడుగాని కేవలం భోగంవలన హాయిగా ఉండలేడు. మానవుడు కోరుకొనేది భోగంకాదు, మానవుడు కోరుకొనేది సుఖం. ఆ సుఖం శాంతి లేకుండా రాదు. అందుచేత మీరు శాంతిని కాపాడుకోండి. పాడుస్నేహాలు కనుక చేస్తే ఉన్నశాంతి ఊడిపోతుంది. ఈ మధ్య మద్రాసు రైల్వేస్టేషనులో ఒక భక్తుడు కలిసాడు. మీరు ఎలా ఉన్నారు, బాగున్నారా అని అడిగాను. బాగాలేకపోవటానికి నాకేమి లోటులేదు, నదీ ప్రవాహం సముద్రం లోనికి ఎంత వేగంగా వెళుతుందో ఆలాగ నామచింతనతో, రూపచింతనతో సంబంధంలేకుండా నా మనస్సు బ్రహ్మంవైపుకు దొర్లించుకు వెళుతోంది. ఈ రూపాలు, నామాల మీద నా మనస్సు నిలబడటం లేదు, ఎక్కడైతే రూపం లేదో, నామం లేదో, ఏది పరమపదమో, ఏది పరమశాంతో అక్కడకు నా మనస్సు దొర్లించుకుంటూ వెళుతోంది అని చెప్పారు. కొంతమంది వారికి సుఖం ఉంటే వారే అనుభవిస్తారు, దుఃఖం వస్తే అందరికి పంచిపెడతారు. నాలుగు వంకాయలు ఉంటే అందులో ఏదిపాడైపోయిందో చూస్తారు





మనకు ఇవ్వటానికి. వారికి పనికిరానిది మనకు కూడా పనికిరాదు అన్న సంగతి వారికి తెలియటం లేదు. వారికి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. దీనినే పాడు తెలివి అంటారు. ఈ తెలివి వాడిని పాడుచేస్తుంది అన్నసంగతి వాడికి తెలియటంలేదు.

లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన ఈ మూడు వాసనలలో ఏ ఒక్కవాసన ఉన్నాసరే వాడికి ఆత్మజ్ఞానం కలుగదు. వాసనలను నువ్వు త్యాగం చేయలేనప్పుడు నువ్వు ఎవడి భక్తుడివి అయినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈ మధ్య మాకు భయం వేస్తోంది అని చాలామంది అంటారు. ఎందుకు భయం వేస్తుంది? నీలోపల ఉండి భయపడేవాడు ఎవడు? లోపల ఉండి ఎవడైతే భయపడుతున్నాడో, నీలో ఎవడైతే రాగద్వేషాలకు గురి అవుతున్నాడో వాడే ఈ శరీరం మరణించాక ఇతరలోకాలకు ప్రయాణం చేస్తాడు. చనిపోయేవాడు వాడే, తిరిగిపుట్టేవాడు వాడే, దేహాలను మోసేవాడు వాడే, లోకాన్ని చూసేవాడు వాడే, పుణ్యపాపాలను సంపాదించుకొనేవాడు, వాటిని అనుభవించేవాడు వాడే. వాడే దొంగనేను. నిజమైననేనుకు తాను తప్పించి ఏమీ లేదు. దొంగనేనుకే ఇవి అన్నీ. ఆ దొంగనేనుతో నీవు ఎందుకు తాదాప్యం పొందుతున్నావు. దానితో తాదాప్యం వదిలేస్తే ఏమీ లేదు. మాకు రాత్రి నిద్రపట్టటం లేదు అని కొంతమంది అంటారు. నిద్రపోకుండా మీకు అడ్డువచ్చేవాడు ఎవడు? ఈ దొంగనేనే అడ్డు వస్తోంది. ఈ నేను అనే తలంపు ఎక్కడనుండి వస్తోంది, మీ లోపల నుండే వస్తుంది. అదే మూలతలంపు. ఆ మూలతలంపు మూలంలోనే బ్రహ్మం ఉంది. ఆ మూలతలంపు మూలాన్ని నీవు తెలుసుకొంటే బ్రహ్మానుభవం నీకు కలుగుతుంది. మిగతా గొడవలు అన్నీ నీకు ఎందుకు. మూలతలంపు మూలాన్ని పట్టుకో. మనం ఎర్రచీమకుడితే ఓర్చుకోలేము. ఎవరైనా చిన్నమాట అంటే భరించలేము. అంటే మనకు ఓర్పులేదు. సహనంలేదు ఆత్మజ్ఞానాన్ని ఆశిస్తున్నాము. మనస్సులో శాంతి లేదు. నిర్మలత్వం లేదు, సహాయసహకారములు అందించే బుద్ధిలేదు, ఆత్మజ్ఞానాన్ని ఆశిస్తున్నాము. నీకు ఎంతసంపద ఉన్నా నీ బుద్ధి పాడైపోయిన తరువాత ఏమి చేసుకొంటావు. మనం పరమాత్మను స్మరించే కొలది పవిత్రులం అవుతాము. మనస్సు బాగుపడుతుంది, బుద్ధికి ఏకాగ్రత, ప్రవీణత కలుగుతుంది. మీ పూర్వీకులు ఎవరైనా మీకు ఉపకారం చేశారు అనుకోండి, వారు చనిపోయి ఎక్కడ ఉన్నా వారిని కృతజ్ఞతతో స్మరించుకోవాలి. మీకు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇస్తే ఏదో ఇచ్చాడు లెండి, చచ్చాడు అంటే ఇవేమి మాటలు. మనం తల్లి కడుపులోనుంచి బయటకు వచ్చినప్పుడు ఎంత

ఉన్నాము? జాగ్రత్తగా చూడకపోతే మనం ఇంత పెద్దవాళ్ళం ఎలా అవుతాము. ఇతరుల సహాయం వలన నీవు పెద్దవాడవు ఎలా అయ్యావో అలాగే నీవు కూడా ఇతరులకు సహాయం అందజెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు. మన పూర్వీకుల జ్ఞాపకార్థం మంచి పనులు చేయటం వలన వారు తరిస్తారు, అంతేకాదు అది యజ్ఞంతో సమానము. భగవంతుడు చెప్పిన మాటలు అధ్యయనం చేయాలి అది కూడా యజ్ఞంతో సమానము, మనకు ఉన్నదానిలో స్వార్థం లేకుండా సమాజానికి కొంత ఉపయోగపడాలి అది కూడా యజ్ఞంతో సమానము. స్వార్థం లేకుండా మనం ఏ పనిచేసినా అది యజ్ఞంతో సమానము. దానివలన మీరు పవిత్రులు అవుతారు, భగవదనుభవం కలుగుతుంది. మాకు ఏదో ఉందండి, మాకు ఉన్నదంతా మేము తినేస్తాము, ఎవరికీ ఏదీ పెట్టము అంటే వారు దొంగలు, వారు అన్నంతింటున్నాము అనుకొంటున్నారు కాని వారు తినేది అన్నంకాదు, పాపం తింటున్నారు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు గాలి ఎవరు ఇచ్చారు, నీరు ఎవరు ఇచ్చారు, నిప్పు ఎవరు ఇచ్చారు, ఈ ఆకాశం, భూమి ఎవరు ఇచ్చారు ఇవి లేకపోతే ఒక్క క్షణం మనం బ్రతకలేము. ఏ దేవుడయితే ఇవి అన్నీ మనకు ఇచ్చాడో ఆయనను స్మరించుకోండి. అదే దైవయజ్ఞం. మనకు అన్నంపెట్టేవాడు ఆయనే, అన్నం ఆయనే, ఈ భూమి ఆయనే, గాలి ఆయనే. అందుచేత ఆయనను స్మరించుకొని గోవిందా, గోవిందా అనుకొని మొదటి ముద్దను తినండి, అప్పుడు భగవంతుడి ఋణం తీరుతుంది. ఎవరో కట్టించిన హైస్కూలులో మనం చదువుకున్నాము అంటే సమాజానికి ఎంతో కొంత ఋణపడి ఉన్నాము. వారు నీకు ఎలాగ సహాయం చేసారో అలాగ నీవుకూడా చేయగలిగిన సహాయం చెయ్యి. అప్పడు సమాజఋణం తీరిపోతుంది. పూర్వీకులు నీకు అన్ని సంపాదించి పెట్టారు అనుకో, వారిని కృతజ్ఞతతో స్మరించుకొంటే వారి ఋణం తీరిపోతుంది. అన్ని ఋణాలు తీరితేకదా మనకుజ్ఞానం కలిగేది అంటున్నాడు భగవంతుడు.

శీతోష్ణములను, సుఖదుఃఖాలను సహించటం నేర్చుకోమని భగవంతుడు చెపుతున్నాడు. బాగావేడిగా ఉంది అనుకోండి, ఎవరైనా వచ్చి ఏదైనా అడిగితే తరువాత మాట్లాడదాము అంటారు. వేడిని తట్టుకోలేక అలా చెపుతాము. వేడిని తట్టుకోవటం కష్టమే కాని అది కూడా సహించటం నేర్చుకోండి. బాగా చలివేస్తోంది అనుకోండి అప్పడు ఎవరైనా ఏదైనా అడిగితే తరువాత చూద్దాము అంటాము. చలిబాధ భరించలేక అలాచెపుతాము, అదికూడా సహించటం నేర్చుకోండి. మనకు సహనం లేనప్పడు,





సత్వగుణం లేనప్పడు లోతులు పెరగవు. మనం కోటిజన్మలు ఎత్తినా, ఎన్ని సాధనలు చేసినా గురువుఅనుగ్రహం లేకుండా మనకు జ్ఞానం కలిగే అవకాశం లేదు.

భగవాన్ ఒక వాక్యం చెప్పారు, ఇది ఆప్తవాక్యం. ఉన్నది ఒక్కటే వస్తువు, అదే ఆత్మ, అదే భగవంతుడు. మనం అందరం ఆయన చేతిలో పనిముట్లం మాత్రమే. మనం స్వతంత్రించి ఏమీ చేయలేము. ఆయన ఎలా ఆడిస్తే అలా ఆడగలము, అంతా ఆయన నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఆ విషయం మనం గుర్తుపెట్టుకొంటే మనకు అశాంతి తగ్గుతుంది. ఈ మధ్య ఎవరో నన్ను అడుగుతున్నారు రమణమహర్షి అని అంటే సరిపోతుంది కదా భగవాన్ రమణమహర్షి అని ముందు భగవాన్ పెడుతున్నారు ఏమిటి అని అడిగారు. అప్పడు నేను చెప్పాను ఎవడైతే పూజార్హుడో, ఎవరిని స్మరించటం వలన మనకు శాంతి కలుగుతుందో, ఎవరి నామాన్ని స్మరించటం వలన మనం పవిత్రులం అవుతున్నామో, ఎవరికి అర్హత ఉందో వారిని, భగవాన్ అని పిలుచుకోవటంలో పొరపాటు లేదు. రమణమహర్షి ఒక్కరే భగవాన్ కాదు, పూజార్హత ఉన్నవాడు ప్రతీవాడు భగవాన్ అని చెప్పాను. గాంధీని మహాత్మగాంధీ అని పిలుస్తారు ఎందుచేతనంటే స్వార్థపరుడు తన స్వార్థంకోసం ఎలాకష్టపడి పనిచేస్తాడో అలాగ ఆయన దేశంకోసం పనిచేసాడు, దేశంకోసం ఆలోచించాడు, దేశంకోసం జీవించాడు, చివరకు దేశంకోసం మరణించాడు అందుచేత ఆయన మహాత్ముడు అయ్యాడు. నీ యిష్టాయిష్టముల మీద ఈలోకం నడవటం లేదు. దేవుడి యొక్క ఆజ్ఞననుసరించి ఈ లోకం నడుస్తోంది. ఈ లోకం ఆయనది, నీది కాదు. నువ్వు మధ్యలో వచ్చావు, మధ్యలో పోతావు. మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేయండి, మీ మనస్సును ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చేయండి. మీ దేహప్రారబ్దంలో మీరు ధనవంతులు అయ్యే యోగం ఉంది అనుకోండి, ఎవరూ ఆపుచేయలేరు. మీ దేహప్రారబ్దంలో మీకు గౌరవం వచ్చే యోగం ఉంది అనుకోండి, ఎవరూ ఆపుచేయలేరు. ఈశ్వరసంకల్పాన్ని మీరు ఆపుచేయలేరు. అనుకొనేది జీవుడి సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. మీరు ప్రశాంతంగా కూర్చొని మీ మనస్సు ఎందుకు బాహ్యాముఖానికి వెళుతోందో చూసుకోండి. మనస్సు బయటకు వెళ్ళింది అంటే అక్కడ ఇష్టం అయినా ఉండాలి, అయిష్టం అయినా ఉండాలి. ఇష్టం, అయిష్టం కనుక లేకపోతే మనస్సు బయటకు వెళ్ళదు. సాధన అంటే ప్రయత్నం, మన ప్రయత్నం ఏదో మనం చేయాలి. కాని ఒక్కటి గుర్తు పెట్టుకోండి మనం ఎన్ని చేసినా ఈశ్వరుని దయ లేకుండా మనకు జ్ఞానం కలుగదు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 9-6-03, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్, బాబాగారు వీరందరూ కూడా భగవంతుడి ప్రతినిధులే, వారు మన జీవితాలను సారవంతం చేసారు, అనేకమంది జీవితాలకు వెలుగుచూపించారు. అజ్ఞానంలోనుండి బయటకురావాలి అనే తపన వారి అనుగ్రహంలేకుండా మనకు కలుగదు. ఒక దేవతయొక్క అనుగ్రహం లేకుండా మనం అజ్ఞానంలో నుండి బయటకురాలేము. మనం జీవితంలో అభివృద్ధిలోనికి రావాలంటే ఆరోజుకారోజు ఆలోచన పెంచుకొంటూరావాలి, అహంభావన తగ్గించుకొంటూరావాలి, ఇదిసాధనఅంటే. మీకు అందరికి ఆత్మజ్ఞానంకలగాలి, మీరు అందరూ జీవన్ముక్తులు అవ్వాలి, ఎవరో బాబాగారు, భగవాన్ జ్ఞానులు అయితే సరిపోదు, మీరుకూడా అంతటి వారు అవ్వాలని, ఆత్మానందం మీరుకూడా పొందాలని ఈసభలు, సమావేశాలు అంతేగాని ఇవి పబ్లిసిటీకోసంకాదు. మనమనస్సు ఇంద్రియాలద్వారా బయటకు వెళ్ళి విషయ ఆకర్షణకుఎక్కువలోబడుతూ ఉంటుంది. మనకు విషయాలపట్ల ఉన్న ఆకర్షణ ఈశ్వరుడి మీద ఉండదు. మన మనస్సు విషయచింతనవైపుకు ఎంత వేగంగా వెళుతుందో అంతవేగంగా ఆత్మవైపుకు వెళ్ళదు. మనకు రూపంఅన్నా, నామంఅన్నా బాగా ఇష్టం. భగవంతుడి యొక్క రూపాన్ని అలంకరిస్తే మనరూపం ఆరూపం మీద నిలబడి ఉంటుంది, బాగా అలంకరిస్తే చూసేకొలది చూడాలని పిస్తుంది, అప్పుడు మనకు దేవతాచింతన పెరుగుతుంది, ఆదేవతమీద ఇష్టం పెరుగుతుంది, విషయచింతన తగ్గుతుంది. అందుకే మన పెద్దలు దేవతలను అలంకరిస్తారు. దేవుడు అంతటా ఉన్నాడు కదా మరి గుడికి వెళ్ళటం ఎందుకు అంటారు. ఆవులో పాలు ఉంటాయి కాని అవి ఎక్కడ పితికితే అక్కడ నుండి పాలురావు, పొదుగు దగ్గర ఉన్న సన్నకట్లు పట్టుకొని పిండితే పాలు వస్తాయి అలాగే భగవంతుడు అంతటా ఉన్నాడు కాని ఆయనకు ఒక గుడి కట్టించి ఆయనకు ఒకరూపం కల్పించి, ఒక నామంపెట్టి ఆయనను పూజించటం వలన ఆవు పొదుగులో నుండి పాలు ఎలా వస్తాయో అలాగే ఆరూపం ద్వారా మనకు ఆయన కృప కలుగుతుంది అందుకే మనం గుడికి వెళతాము. గుడిలో శివుడిని చూస్తూ ఉంటే శవభావం తగ్గి, శివభావం పెరుగుతూ ఉంటుంది.

ఈ శరీరమే ఆత్మ, ఈశరీరమే సర్వస్వం, ఈశరీరమే జ్ఞానం అని మనం అనుకొంటున్నాము. ఆత్మకు శరీరం లేదు, ఈశరీరం అహంభావనది. ఈ శరీరం ఆత్మకానప్పడు, ఇదే ఆత్మ అని ఎందుకు అనుకొంటున్నాము అంటే దీనికి అజ్ఞానంకారణం, అందులో నుండి మనలను విడుదలచేసేవాడే గురువు. ఆత్మ ఒక్కటే సత్యం, అదేశాంతి, అదే జ్ఞానం, దానికి పుట్టుకలేదు, మరణం లేదు, అది మనమై ఉన్నాము. కాని దాని అనుభవం మనకు లేకపోవటం వలన అది, ఇది అనుకొంటున్నాము, మరణానికి గురి అవుతున్నాము. ఇతరులచేత మనం గౌరవింపబడాలి అనే కోరిక మనకు ఉండకూడదు. గౌరవింపబడాలి అనే కోరిక ఉంటే మనం భక్తులం అవ్వలేము, మనమనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. మానవ కల్పితంకానిది, ప్రకృతి కల్పితంకానిది బ్రహ్మం ఒక్కటే, ఆబ్రహ్మమునే భక్తుడు భగవంతుడు అని పిలుస్తున్నాడు. మన శరీరం అందంగా, ఆరోగ్యంగాఉంది అనుకోండి కాని మనస్సు అందంగా, ఆరోగ్యంగా లేదు అనుకోండి మనకు సమగ్రతరాదు, నిండుతనంరాదు. మీరు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నారు అనుకోండి, మనస్సు శాంతిగా ఉంది అనుకోండి మీమొఖాలు చూస్తే శాంతిగా, కాంతిగా ఉంటాయి. ప్రపంచంలో అన్నింటికంటే గొప్పది శాంతి. శాంతి లేకుండా సుఖంలేదు, ఆనందంలేదు. వేలాదికోట్లు డబ్బు ఉన్నవారుకూడా శాంతిలేక కాలిపోతూ ఉంటారు. శాంతి ఉన్నవాడికి ఆనందం, సుఖం, శాంతిలేనివాడు కాలిపోవడం. శాంతిలో మనం స్థిరపడినప్పడు పునర్జన్మ లేని స్థితికి ఎదిగి, ఆత్మానుభవం పొందుతాము. జీవితంలో కష్టం వస్తుంది, సుఖంవస్తుంది, వేడివస్తుంది, చలివస్తుంది వీటిని సహించటం నేర్చుకో. నీ దేహప్రారబ్దమును బట్టి ఒకోసారి చిక్కులు రావచ్చును, కష్టాలు రావచ్చును ఏసమస్య వచ్చినా పారిపోకు, ఏడపు మొఖంతో కాకుండా నవ్వుతూ శాంతిగా వాటిని పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎవరైతే కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారో వారు కాలానికి యజమానులు అవుతారు, ఎవరైతే కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం లేదో వారు కాలానికి బానిసలవుతారు. జ్ఞానికాలాన్ని జయిస్తాడు, వాడు కాలానికి యజమాని, అది జ్ఞానం యొక్క వైభవం. షిరిడీబాబా గారిలో కులబేధం లేదు, మతబేధం లేదు, హిందూ ముస్లిములసమైక్యత కోసం హృదయపూర్వకంగా పనిచేసారు. ప్రతీ మతంలోనూ మంచి, చెడూ ఉండవచ్చు. మనమతం గొప్పది, ఇతర మతాలు గొప్పవి కావు అని అనుకోకూడదు, దాని వలన టైమువేస్టు, ఎనర్జీవేస్టు ఎప్పడూ ఇతరుల లోపాలు చూడటం కాదు, మనలో ఉన్నలోపాలు మనం చూసుకోవాలి, అది సత్వగుణం ఉన్నవాడి లక్షణం, బాగుపడే వాడి లక్షణం. ఎక్కడైనా మంచి ఉంటే , సభ్యత

ఉంటే, నాగరికత ఉంటే అది మనం అంగీకరించాలి, అదిమనం నేర్చుకోవాలి. నామనస్సులో అనేకకోరికలు రావచ్చు, మంచి కోరికలు రావచ్చు, చెడు కోరికలు రావచ్చు, ఇదంతా వాసనను బట్టి వస్తుంది. ఆకోరికలకు, ఈమనస్సుకు, ఈశరీరానికి, మన చేతచూడబడే ఈలోకానికి వీటి అన్నింటికి అతీతంగా ఒక వస్తువు ఉంది, అదే బ్రహ్మం. అది ఉండటమేకాదు, అది మనమై ఉన్నాము దాని తాలుక అనుభవం మనకు వచ్చేవరకు ఈజననమరణాలు ఈప్రకృతి మనలను విడిచిపెట్టదు. మనం హిందూమతంలో పుట్టాము, ఇందులో కూడా మోక్షానికి తగిన సామాగ్రి ఉంది, అందువలన మన మతాన్ని అర్ధంచేసుకొని, అందులోని విషయాలను ఆచరించి మనం బాగుపడాలి కాని పరమత దూషణవద్దు. పుట్టిన వాడు మరణిస్తాడు, మరణించినవాడు తిరిగి పుడతాడు, దీని గురించి బెంగ ఎందుకు, ఇది సహజం, మీరు భక్తిని విడిచిపెట్టవద్దు, భక్తి వలన శాంతి వస్తుంది, ముక్తి కలుగుతుంది. ఆత్మ అన్నా, గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. ఆత్మను విడిచిపెట్టి గురువులేడు. కోటి గ్రంధాలు చదవటం కంటే కోటి ప్రాణాయామాలు చేయటం కంటే మనం బాగుపడటానికి గురువు యొక్క అనుగ్రహం లిప్తమాత్రం సరిపోతుంది. భగవంతుడు ఉన్నాడని మనం నమ్ముతున్నాము కాని నూటికి నూరుపాళ్ళు నమ్మటం లేదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని నూటికి నూరుపాళ్ళు మనకు నమ్మకం ఉంటే ఆయన సంకల్పం ప్రకారమే ఈ సృష్టి అంతా నడుస్తోంది అనే స్థిరభావం మనకు ఉంటే మన మనస్సు పల్చబడి, చిరిగిపోతుంది. ఈప్లాట్‌ఫారం క్రింద బంగారం ఉంది అనుకోండి ఇక్కడ బంగారం ఉంది అని నాకు తెలియదు అనుకోండి, అక్కడే ఎన్ని సంవత్సరాలు తిరిగినా బంగారం కోసం అక్కడ వెతకాలి అని నాకు తెలియదు. ఎవరో గురువు వచ్చి నువ్వు ఎక్కడైతే కూర్చొన్నావో అక్కడే బంగారం ఉంది బంగారం కోసం మార్కెట్‌లో తిరుగుతున్నావు అని చెపితే అయితే ఇక్కడే ఉందా, ఇక్కడ త్రవ్వి చూద్దాము అనుకొంటావు. అలాగే సత్యవస్తువు ఎక్కడ ఉందోనీకు చూపించి, అక్కడకు నిన్ను తీసుకొని వెళ్ళేవాడే గురువు, వాడే దేవుడు, వాడే నిజమైన మిత్రుడు. మనకు స్వప్నంవచ్చినప్పుడు స్వప్నాన్ని చూస్తాము, అది నిజం అనుకొంటాము. మరల జాగ్రదవస్థలోనికి రాగానే అది స్వప్నం, నిజం కాదు అని మనకు తెలుస్తుంది. ఇప్పుడు మనకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్ని స్వప్నంలాగ చూడటం నేర్చుకోవాలి, అప్పుడు మనస్సులోపలకు వెళుతుంది. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు గర్వం తెచ్చుకోవద్దు, ప్రతికూలంగా ఉన్నప్పుడు కృంగిపోవద్దు. ఇవన్నీ నిజంకాదు,

**20-09-2003**



ఈసంఘటలన్నీ దేహప్రారబ్దమును బట్టి ఎదురవుతాయి, ఇది జ్ఞాపకం పెట్టుకోండి.

మనకు మనస్సే నేనుగా వ్యక్త మవుతోంది. పెంటఅంతా మనస్సులోనే ఉంది. అది ఎవరని దానిని మనం విచారణ చేయాలి. అది నశించిన వెంటనే స్వరూపంతానుగా వ్యక్తమవుతుంది. ఆసక్తిపెట్టుకోవద్దు, ఆసక్తిపెట్టుకొనే కొలది మిధ్యానేను పెరుగుతుంది. నువ్వు చేసేపని శ్రద్దగా చేసుకో. భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు, చేతనైతే సమాజానికి ఉపకరించు. కీర్తి తాలుక ధ్యాస, కీర్తి తాలుక తలంపు ఎవడికైతే లేదో వాడు భక్తుడు. మనం బాగుపడాలంటే నిరంతరం కృషి చేయాలి, సాధన చేయాలి. ఆత్మజ్ఞానం పొందాలి అనుకొన్నప్పుడు విశ్రాంతి లేని కృషి అవసరం. నిష్కామకర్మచేయండి, మీకు ఏదైనా మంచి విషయం తెలిస్తే అది ఇతరులకు బోధించండి,ఇతరులు ఎవరైనా దుఃఖంతో కాలిపోతూ ఉంటే చల్లని మాటలు చెప్పండి, చల్లని చూపులు ప్రసాదించండి. ఈసృష్టిలో అన్నింటికంటే అందమైనది బ్రహ్మం. బ్రహ్మం ఎంత అందంగా ఉందో, ఎంత సౌందర్యంగా ఉందో మన మనస్సును కూడా అంత సౌందర్యవంతంగా చేసుకుంటే గాని ఇది అందులో లీనం కాదు. మూడు నెలలు, ఆరునెలలు పసి పిల్లలను చూడండి, ఎంత హాయిగా నిద్రపోతూ ఉంటారో, వారి అమాయకత్వమే వారికి అందం. తల్లి వాళ్లను ముస్తాబుచేస్తుంది. వారికి కపటం తెలియదు, ఈర్ష్య, అసూయ తెలియదు. అటువంటి స్థితి మనకు వస్తేకదా మనకు జ్ఞానం కలిగేది. ఇంట్లో పేచీలు, సమాజంలో పేచీలు, మనిషికి మనిషికి బేధాలు ఇవన్నీ మనస్సు నుండిపుడుతున్నాయి. ఇవిఅన్నీ మనస్సుకు సంబంధించిన వృత్తులు, ఆ మనస్సు అనే గడప దాటితేనే గాని హృదయంలో ఉన్న సౌందర్యం మనకు అందదు. ఎవరో వచ్చి మిమ్మల్ని యాతన పెట్టనక్కరలేదు, మీ మనస్సే చాలు, అందుకే దానిని యాతనాశరీరం అంటారు. ఈయాతనాశరీరం నుండి విడుదల పొందితేకదా హృదయంలో ఉన్న సౌందర్యం మనకు తెలిసేది. మనస్సు సౌందర్యంగా ఉంటే, ఏకాగ్రంగా ఉంటే, శుచిగా ఉంటే లోపలఉన్న జ్ఞానగంగ మన చేతికి అందుతుంది. మీరు ఏపనిచేసినా, ఏది మాట్లాడినా భగవంతుని దయకోసమే చేయండి. మీ గొప్పతనం వ్యక్తంచేయటం కోసం ఒక్కమాట మాట్లాడినా లోపల అజ్ఞానం పెరిగిపోతుంది అవిద్యలో కూరుకుపోతాము. గురువు ఋణం ఎప్పడు తీరుతుంది? గురువు చెప్పినది బాగా అర్ధం చేసుకొని, ఆచరించి, అనుభవిస్తే అప్పడు గురువు ఋణం తీరుతుంది.

రమణ భాస్కర

# సత్సంగ ప్రాముఖ్యత

**(కె. వీరలక్ష్మి, విజయనగరం)**

భగవాన్ శ్రీరమణులు సత్సంగమంటే "సత్" తో సంగమం, "సత్" కేవలం ఆత్మకు చెందినది. ఆత్మ "సత్" అని ప్రత్యక్షానుభవం లేదుకనుక దానిని తెలిసిన యోగుల సంసర్గము సత్సంగమని తెలిపిరి. అంతర్ముఖత్వం దాని ఫలమనియు, మనస్సు దుర్బలంకనుక సత్సంగము, ఈశ్వరారాధనము, సద్గ్రంథపఠనము అన్నియు ఎంతోమహిమాన్విత ములైయున్నవి. ఇవి సాధకునకు ఆధ్యాత్మిక పురోగతిని కలుగజేయునని చెప్పిరి.

క్షేత్రదర్శనము, విగ్రహారాధన కన్న సత్పురుషుల సాన్నిత్యము విశేష ఫలప్రదమని శ్రీరమణులు తెల్పిరి. ఏమనగా కాలాంతరమున అవి ఫలితాన్ని ఇస్తాయి. సత్పురుషుల దర్శనము తక్షణమే ఫలవంతమగునని చెప్పియున్నారు.

ఉదా శ్లో : గంగాపాపం శశీతాపం
దైన్యం కల్పతరుస్థథా
పాపం తాపం దైన్యంచ
హన్తి సజ్జనదర్శనం

ఇవి ఒక్కొక్క గుణాన్ని ఒక్కొక్క క్షేత్రం కాని, ఆయాదేవతలు కాని నశింపజేస్తే ఆమూడు గుణాలు సజ్జన దర్శనము వలన క్షాళితమవుతాయని శ్రీరమణులు తెల్పిరి.

శ్రీ సద్గురు నాన్నగారి పిన్నవయసులో ఒకనాటి రాత్రి స్వప్నమున శ్రీరమణుల అనుగ్రహ స్పర్శను పొంది ఏసాధనము, తపమును, లేకుండగనే అద్వైతానుభూతిని పొందిరి. తదాది వీరు శ్రీ రమణుల దివ్యబోధనలను వాడవాడలా, దేశదేశములా అలుపు, విరామము ఎరుగని దీక్షతో ప్రచారము చేయుచున్నారు. జన సామాన్యమునకు ఆధ్యాత్మిక మార్గ ప్రగతిని అందజేయుచున్నారు. సద్గురు నాన్నగారి అనుగ్రహభాషణలు ఎందరెందరికో లౌకికముగా మనోధైర్యాన్ని, మనశ్శాంతిని కలుగజేయుచున్నాయి. సత్పురుషుల ఒక వీక్షణం, అనుగ్రహభాషణము, దివ్య ప్రేమాన్వితమైన స్పర్శ, ఎంతటి మహిమాన్వితమైనవో శ్రీనాన్నగారిని ఎరిగియున్న భక్తులకెల్లరకు అనుభవైకవేద్యమై యున్నది.

సత్పురుషుని ఉనికి వల్లనే లోకంలో శాంతి నెలకొని యున్నది. మనం భుజించే ఆహారం, త్రాగేనీరు, పీల్చేగాలి, మనస్సు, ఆలోచన, అన్నియు సత్పురుషుల సంగం ద్వారా పునీతములవుతున్నాయి. సత్పురుషుని స్పర్శను పొందిన ఆహారం ప్రసాదమని భారతీయుల విశ్వాసం. వారి దయా వీక్షణం వలన సకల జీవకోటి శాంతిగా, సుఖంగా జీవిస్తాయి.

శ్రీరమణుల కాలంలో ఆయన దర్శనం కోసం మానవమాత్రులేకాక పశుపక్ష్యాది జీవులు కూడా వస్తూండేవి. వారి సాన్నిధ్యం ఆ మూగజీవరాశులకు కూడా ఎంతటి సంతోషం కలుగజేయుచుండెడిదో. శ్రీరమణులు భూమి మీద సంచరించిన ప్రాంతం నేడు పవిత్ర క్షేత్రమై విరాజిల్లు చున్నది. కనుక సత్పురుషులు భూమిమీద సంచరిస్తున్న కాలంలో వారిని జనులు గుర్తించి సేవించిన ఎడల వేరు విధములైన ఏ నియమ నిష్ఠల ఆవశ్యకత లేకుండగనే సాధకులు పురోగతిని పొందుతారనెడిది నిత్య సత్యమై యున్నది.

భారతీయ తత్త్వశాస్త్రంలో సత్పురుషులకు విశిష్టమైన స్థానమీయబడినది. అందుకనే "దుర్లభంత్రయమేతతే" అని పెద్దలన్నారు. 1. మానవజన్మ, 2. మోక్షేచ్ఛ, 3. మహాపురుషుల సాంగత్యం అని తెలిపిరి. సత్పురుషుల సాంగత్యమును భక్తులు పొందినయెడల వారికి ఏనియమముల ఆవశ్యకత లేకయే ఆధ్మాత్మిక ప్రగతిని పొందుతారు అనే విషయంలో సందేహంలేదు. శ్రీ శంకరాచార్యుల వాక్కు కూడా ఈ విధంగా కలదు.

శ్లో : సంత్సంగత్వేనిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చల తత్త్వం
నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః

శ్రీ శంకరులు చెప్పిన విధంగా జీవన్ముక్తికి సత్సంగం సోపానమై యున్నది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-6-03 | మంగళవారం | రాజోలు, దొరగారి తోట, రంగరాజు గారి ఇల్లు |
| 30-6-03 | సోమవారం | దర్భరేవు |
| 13-7-03 | ఆదివారం | జిన్నూరు, శ్రీరమణక్షేత్రం, గురుపూర్ణిమ మహోత్సవము |

# చిత్తశుద్ధి

దుఃఖమునకు కారణం కర్తృత్త్వబుద్ధి. కర్తృత్త్వబుద్ధి నశించకుండా దుఃఖం నశించదు. కర్తృత్వబుద్ధి కారణమయితే దుఃఖం కార్యము. కర్తృత్త్వబుద్ధి ప్రకృతిగుణము, ఈశ్వరుడు కల్పించింది కాదు. ప్రకృతిని చింతిస్తూ ప్రకృతిగుణమును దాటలేము. నిరంతరము ఈశ్వరుడిని స్మరించటం వలన ప్రకృతిగుణములు నశిస్తాయి. ప్రకృతికి ఉన్నవికారములలో మొదటి వికారము కర్తృత్త్వబుద్ధి. దేహము పట్ల ఉన్న అహంబుద్ధి నుండి అది ఉదయిస్తుంది. కర్తృత్త్వము స్థూలరూపములో ఉన్నా, సూక్ష్మరూపములో ఉన్నా మానవుడిని పీడిస్తూ ఉంటుంది. ఈశ్వరదర్శనం అయిన వెంటనే అది అదృశ్యమవుతుంది.

చిత్తశుద్ధి లేకుండా కర్తృత్త్వబుద్ది నశించదు. ఈశ్వరుని ధ్యానించకుండా చిత్తశుద్ధి కలుగదు. ఈశ్వరునికృప లభ్యమయ్యేవరకు ఉపాసన విడిచిపెట్టకూడదు. సాధకుడు సర్వవిధముల ప్రయత్నముచేసి చిత్తశుద్ధిని సంపాదించవలెను. పూజసాధన, జపసాధన. ధ్యానసాధన చిత్తశుద్ధిని సంపాదించుటకు సహకరిస్తాయి. ఈశ్వరార్పణబుద్ధితో కర్మను ఆచరించే వాడికి చిత్తశుద్ధి కల్గుతుంది, కాలక్రమంలో జ్ఞానోదయం అవుతుంది. చిత్తశుద్ధి కల్గినవాడికి మాత్రమే అంతర్‌దృష్టికలుగుతుంది, అంతర్‌దృష్టి కలిగినవాడికి అమృతానుభవం కల్గుతుంది. ధర్మం పింది అయితే అమృతం పండు. అమృతానుభవం పొందినవాడికి మాత్రమే ఉన్నది ఉన్నట్లుగా లేనిది లేనట్లుగా గోచరమవుతుంది.

ప్రపంచమంతా తలంపుల సమూహము. తలంపులు త్యజించిన వాడికి సుఖం స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ద్వైతమును కల్పించేవి తలంపులు. సమబుద్ధిని అలవర్చుకొని ద్వైతబుద్ధినుండి, భేదబుద్దినుండి బయటపడాలి. చిత్తశుద్ధిలేకుండా బేధబుద్ధి నశించదు. బేధబుద్ధి నశించిన వాడు శ్రమలేకుండా అజ్ఞానబంధము నుండి విడుదలపొందుతాడు, కర్మను ప్రీతితోచేసేవాడికి, కర్మఫలమును కోరనివాడికి, తోటిమానవుడిని ద్వేషించని వానికి చిత్తశుద్ది కల్గుతుంది. సమచిత్తత లభిస్తుంది, శ్రమలేకుండా దేహాభిమానము నుండి విడుదలపొందుతాడు. పేరుకోసం కర్మను ఆచరించేవాడు అశుద్ధచిత్తం నుండి విడుదలపొందలేడు. చిత్తశుద్దిలేనివాడు మృత్యువును అతిక్రమించలేడు, ఆత్మవిద్యను సంపాదించలేడు, మోక్షమును పొందలేడు.

సద్గురు శ్రీ నాన్నగారు, జిన్నూరు

# శాశ్వతమైన జీవితము

మన స్వరూపాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడమే నిజమైనజీవితం. ప్రస్తుత మన జీవితంలో పూర్ణత్వం లేదు, ఏదో వెలితి, అశాంతి, దుఃఖం వెంటాడుతున్న కారణంగా, మనము శాశ్వతమైన జీవితాన్ని కోరుకుంటున్నాము. వాస్తవంగా మన స్వరూపంలో వెలితి, అశాంతి, దుఃఖం లేవు కాబట్టి వాటినుండి విడుదల పొందాలని కోరుకుంటున్నాము. నిర్మల 'ఆత్మ', పరమశాంతి యే మన సహజస్వరూపమైనప్పటికి కేవలము 'దేహము-నేను' అను బుద్ధి వల్ల దుఃఖాన్ని మోస్తున్నాము. శరీరము కేవలం ఒక తలంపు మాత్రమే. మూల-తలంపు రూపంలో సాక్షాత్తు 'ఆత్మ' నుండి ఉదయించే 'మనస్సు' యొక్క ఛాయారూప ఆకృతియే ఈ శరీరము.

కేవలం శరీరం మారడం వల్ల, అనగా శరీరం మరణించడం వల్ల సమస్య పరిష్కారము కాదు. శరీరం మారడం వల్ల 'అహంకారం' ఒక దేహము నుండి వేరొక దేహము లోనికి బదిలీ అవుతుంది. శాశ్వతమైన, కాలాతీతమైన కేవల ఉనికిగా, మహాచైతన్యముగా, అనంతముగా ఉండటమే నిజమైనజీవితం. హద్దులు, పరిమితులు లేని నిజమైన మన ఉనికిని కేవలము దేహమునకే పరిమితము చేస్తే, అనగా మనము దేహమాత్రుడిగా భావిస్తే, హద్దులకు, పరిమితులకు లోబడి అశాంతిని, దుఃఖాన్ని, పొందుచున్నాము. దేహబుద్ధి అనగా కేవలము 'దేహము-నేను' అను బుద్ధి నశిస్తే మన సహజస్థితి యైన సచ్చిదానంద అనంతత్త్వము అనుభవంలోనికి వస్తుంది, అప్పడు మనది నిజమైన శాశ్వతమైన జీవితం అవుతుంది.

చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్
అమలాపురం